ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 3 జూలై 2025



రాజీతో కేసులు పరిష్కరించుకోవాలి

● ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
● జిల్లా న్యాయాధికారి శాంతి

8





కేబినెట్ సమావేశంలో సీఎం, డీసీఎం, మంత్రులు

● బాగేపల్లి ఇకపై భాగ్యనగర
● రాష్ట్ర కేబినెట్ భేటీలో పలు కీలక తీర్మానాలు
● రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వడానికే నందికొండలపై సమావేశం : సీఎం సిద్దరామయ్య

బెంగళూరు యూనివర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని 'డాక్టర్ మన్మోహన్‌సింగ్ బెంగళూరు సిటీ వీవీ'గా పేరు పెట్టడంతోపాటు చిక్కబళ్ళాపుర జిల్లాలో వెనుకబడిన, సరిహద్దులోని తాలూకా కేంద్రమైన బాగేపల్లికి 'భాగ్యనగర' అని, బెంగళూరు గ్రామీణ జిల్లాను ఇకపై బెంగళూరు ఉత్తర తాలూకాగా నామకరణం చేస్తూ రాష్ట్ర కేబినెట్ భేటీలో నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన చిక్కబళ్ళాపుర జిల్లాలోని నందికొండలపై బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు. మంత్రివర్గభేటీ అనంతరం సీఎం స్వయంగా మీడియాతో మాట్లాడారు. మొత్తం 48 అంశాలపై చర్చ జరిగిందని 90శాతం బెంగళూరు అంశాలు ఉన్నాయన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3,400 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇందులో బెంగళూరు జిల్లా అభివృద్ధికి రూ.2,250 కోట్లు కేటాయించామన్నారు. ఎత్తినహోళె పథకానికి రూ.23,251 కోట్లు అంచనా వేశామని, ఇంతవరకు రూ.17,147కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. ఈ పథకం ప్రధానంగా తాగునీటి కోసం ఉద్దేశించినదన్నారు. చెరువులకు నీరు నింపడం కూడా ప్రాధాన్యం ఉందన్నారు. 24.1 టీఎంసీలలో 14 టీఎంసీలు తాగునీటి అవసరాలకు అవసరమన్నారు. అందుకే తొలుత తాగునీటిని అందించేలా పథకాన్ని పూర్తి చేయాలని మంత్రివర్గం తీర్మానించిందన్నారు. మరో రెండేళ్లలో ఈ పథకం ద్వారా ఉద్దేశించిన జిల్లాలు, తాలూకాలకు నీరు అందిస్తామన్నారు. రూ.9,807 కోట్ల మొత్తంతో గ్రావిటీ ప్రధాన కాలువ పనులు 85శాతం ముగిశాయన్నారు. అదనంగా 8వేల కోట్లు అవసరం కానుందన్నారు. ఎత్తినహోళె పథకం పూర్తయితే మొత్తం 9 జిల్లాల్లో 75లక్షలమందికి తాగునీరు అందిస్తామన్నారు.



నందికొండలపై కేబినెట్ గ్రూప్ ఫొటో

బెంగళూరు జిల్లాకు రూ.2,250 కోట్లు

బెంగళూరు జిల్లాలో 31 అంశాలపై చర్చించి వివిధ పథకాలకు రూ.2,250 కోట్లు మంజూరు చేసినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. కాగా ప్రతి జిల్లాలో కార్మికుల పిల్లలకోసం వసతి పాఠశాల నిర్మించేలా తీర్మానించామన్నారు. ఇందుకుగాను రూ.1125.25 కోట్లు అవసరంగా గుర్తించి మంజూరు చేశామన్నారు. విద్య, ఆరోగ్యం, తాగునీరు, నీరావరి పథకాలు, చెరువులు నింపే పథకాలపై చర్చ జరిగిందన్నారు. వెనుకబడినవర్గాల అభ్యర్థులకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి పోటీ పరీక్షల తర్ఫీదుకోసం రూ.10కోట్లతో రెండు వసతి పాఠశాలలను బెంగళూరులో నిర్మిస్తామన్నారు. కాగా ప్రైమరీ హెల్త్ సెంటర్ (పీహెచ్‌సీ)లు లేని కొత్త తాలూకాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లు ప్రారంభించేలా తీర్మానించామన్నారు. ఈ సంవత్సరంలో 14వ మంత్రివర్గ సమావేశాన్ని నందికొండలపై నిర్వహించామన్నారు. పాలన బెంగళూరు కేంద్రంగా పరిమితం కారాదనే ఉద్దేశ్యంతోనే అధికార వికేంద్రీకరణకోసం ఆయా ప్రాంత సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించేలా వేర్వేరు ప్రదేశాల్లో కేబినెట్ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత కలబురగిలో, అనంతరం మలెమహదేశ్వర కొండపై నిర్వహించామని మూడోది నందికొండలపై జరిపామన్నారు. ఎత్తినహోళె పథకంపనులను వేగిరం చేసి చిక్కబళ్ళాపుర, కోలారు జిల్లాల్లోని గ్రామాలకు నీరు అందించేలా సూచించామన్నారు. రూ.237 కోట్లతో బెంగళూరు వ్యర్థపు నీటిని శుద్ధీకరించి శిడ్లఘట్ట, చింతామణి తాలూకాల్లోని 164 చెరువులను నింపే పథకానికి ఆమోదం తెలిపామన్నారు. ఈ ప్రాంతంలో పూలసాగు అధికంగా ఉందని అంతర్జాతీయ పూల వేలం కేంద్రాన్ని రూ.10కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. దీనికి తోడు చిక్కబళ్ళాపురలో ఏపీఎంసీ ఆధ్వర్యంలో రూ.141.5 కోట్లతో హైటెక్ పూల మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపామన్నారు. కాగా గనుల అక్రమాలకు సంబంధించి ఇదివరకు తీసుకున్న చర్యలు, ప్రగతిని పరిశీలించేందుకు హెచ్‌కే పాటిల్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసమితిని ఏర్పాటు చేసేలా తీర్మానించామన్నారు. ఇలా మొత్తమ్మీద స్థానిక అభివృద్ధికోసం పలు పథకాలు, కార్యక్రమాల అంశాలపై మంత్రివర్గంలో తీర్మానించామన్నారు. అంతకముందు నందికొండలపై ఉన్న ఆలయాన్ని సందర్శించారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వడానికే నందికొండల్లో కేబినెట్ భేటీ నిర్వహించినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు.

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల ఎత్తివేత

● ఆరు గేట్ల నుంచి నదిలోకి నీరు ● ముందస్తు వర్షాలతో జూలైలోనే..



ఆరు గేట్ల నుంచి విడుదలవుతున్న వరద నీరు

బళ్లారి గాంధీనగర్/హోస్పేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి అధికారులు బుధవారం నీటిని విడుదల చేశారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 78.100 టీఎంసీలకు చేరాయి. డ్యాం భద్రత దృష్ట్యా ఈ ఏడాది 80 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయవద్దని నిపుణులు సూచించడంతో అధికారులు ఆరు క్రస్ట్‌గేట్‌లను తెరిచారు. నదిలోకి 17,635 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు కాగా, ప్రస్తుతం 1625.20 అడుగుల వరకూ నీరు చేరింది. నీటి పారుదల సలహా మండలి తీర్మానం మేరకు కాలువలకు నీటి విడుదల ప్రక్రియ మంగళవారం నుంచి మొదలైంది. వివిధ సాగునీటి కాలువలకు 1,701 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలోకి 32,494 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. జలాశయం నీటి నిల్వలు గురువారం ఉదయానికి 80 టీఎంసీలు దాటే అవకాశం ఉండటంతో అధికారులు బుధవారం ఉదయం రెండు క్రస్ట్‌గేట్లను ఎత్తి.. తొలుత 4,680 క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. అనంతరం ఇన్‌ఫ్లో పెరుగుతుండడంతో సాయంత్రానికి నాలుగు గేట్లను రెండడుగుల మేరకు ఎత్తి 9,400 క్యూసెక్కుల నీరు నదికి వదిలారు. ఆ తరువాత మరో రెండు గేట్లను ఎత్తారు. మొత్తంగా ఆరు క్రస్ట్ గేట్‌ల నుంచి 17,635 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

భద్రతకు ప్రాధాన్యం

తుంగభద్ర జలాశయం ఎగువ పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇన్‌ఫ్లో పెరుగుతూ వచ్చింది. గత ఏడాది 19వ క్రస్ట్‌గేట్ కొట్టుకుపోయాక మిగిలిన క్రస్ట్‌గేట్‌ల పరిస్థితిని కేంద్ర జల సంఘం నిపుణులు పరిశీలించారు. డ్యాం భద్రత దృష్ట్యా ఈ ఏడాది నీటి నిల్వలను 80 టీఎంసీలకు పరిమితం చేయాలని సూచించారు. తాజా నిల్వలు, వరదల నేపథ్యంలో డ్యాం అధికారులు ముందు జాగ్రత్తగా నీటిని నదికి వదులుతున్నారు. జలాశయం భద్రతపై గట్టి నిఘా పెట్టారు. సాధారణంగా జలాశయం నుంచి ఆగస్టులో నదికి నీటిని వదిలేవారు. కానీ ఈ ఏడాది క్రస్ట్‌గేట్‌లపై ఒత్తిడి ఉండకూడదని నెలరోజుల ముందే నీటిని వదులుతున్నారు. జలాశయం చరిత్రలో ఇంత ముందస్తుగా నదికి నీరు వదిలిన సందర్భాలు లేవని బోర్డు అధికారులు అంటున్నారు. ఎల్‌బీఎంసీ, ఎల్లెల్సీ, హెచ్చెల్సీ లాంటి ప్రధాన కాలువలకు ఇప్పటి వరకు నీటిని విడుదల చేయలేదు. ఆ కాలువల మరమ్మతుల నేపథ్యంలో తాత్కాలికంగా ఆలస్యం చేస్తున్నారు. ఈ నెల 10 తేదీ నాటికి కాలువలకు చిన్నపాటి మరమ్మతులన్నీ పూర్తి అవుతాయి. దీంతో అప్పటివరకు జలాలను నదికి వదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. 10వ తేదీ నుంచి హెచ్చెల్సీతో పాటు ఎల్లెల్సీకి కర్ణాటక వాటా నీటిని వదలాలని నిర్ణయించారు.



నిండుకుండలా టీబీ డ్యాం


ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటిషన్‌పై కొనసాగిన విచారణ



బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అత్యాచార ఆరోపణల కేసులో హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రెండోసారి సమర్పించిన బెయిల్ పిటిషన్ విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. న్యాయమూర్తి ఎస్ఆర్ కృష్ణకుమార్ ఏకసభ్య ధర్మాసనం ముందు బుధవారం పిటిషన్ విచారణకు వచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రొఫెసర్ రవివర్మకుమార్ వాదనలు వినిపించారు. ప్రజ్వల్ ప్రభావిత కుటుంబానికి చెందినవారని, బాధితురాలిని కిడ్నాప్ చేసిన కేసు అతడి కుటుంబంపై ఉందన్నారు. ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తు జాప్యం చేశారన్నారు. అంతేకాక ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ కాలిపై పడి క్షమించాలని బాధితురాలికి పోలీసులు సూచించారన్నారు. ప్రజ్వల్ బెయిల్‌కు అర్హులు కాదని వాదించారు. సమయాభావంతో తదుపరి విచారణను కోర్టు వాయిదా వేసింది.

నడుచుకుంటూ వచ్చి.. బ్రెయిన్‌డెడ్

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి కొద్దిసేపటికే బ్రెయిన్‌డెడ్‌కు గురైన సంఘటన బెంగళూరు గ్రామీణ జిల్లా హొస్కోటె పట్టణంలోని సిలికాన్‌సిటీలో చోటు చేసుకుంది. హొస్కోటె నివాసి కోనప్ప (52) బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి. బుధవారం ఉదయం నుంచి చలాకీగా ఉన్నారు. కోనప్పకు ఒక్కసారిగా ఛాతీలో నొప్పి అనిపించడంతో చికిత్స నిమిత్తం సిలికాన్‌సిటీ ఆసుపత్రికి వచ్చారు. వైద్యులు పరీక్షలకు సిద్ధమవుతుండగానే కార్డియాక్ అరెస్టుతో కుప్పకూలాడు. బంధువులు వెంటనే మరో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినా అప్పటికే బ్రెయిన్‌డెడ్ అయినట్లు గుర్తించారు. స్థానికంగా ఈఘటన కలకలం రేపింది. కోనప్ప కుటుంబంలో విషాదం నెలకొంది.



వీఎస్‌కేయూలో అవకతవకలపై విచారణ ప్రారంభం

బళ్లారి గాంధీనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో చట్టవ్యతిరేకంగా జరిగిన రెండు వేరు వేరు వ్యవహారాలకు సంబంధించి విచారణ ప్రారంభించారు. బెళగావి జిల్లా సెషన్స్ కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డి.ఎస్. శింధే నేతృత్వంలో విచారణ జరుపుతున్నట్లు యునివర్శిటీ ప్రొఫెసర్ మునిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి సంబంధించి స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలను చట్టవ్యతిరేకంగా పంపిణీ జరిగినట్లు ఆరోపణలపై రెండు రోజులుగా పరిశీలన జరుపుతున్నట్లు తెలిపారు. తదుపరి విచారణను 9వ తేదీకి వాయిదా వేశారన్నారు. డిగ్రీ పట్టాల పంపిణీలకు సంబంధించి ఇప్పటికే విద్యార్థి సాక్ష్యాదారాలతో పాటు పరీక్షా విభాగ సిబ్బందిపై విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మరోక వ్యవహారంలో డాక్టర్ అనంత్‌ఎల్ ఝుండేకర్ కేసు కూడా రిటైర్డ్ న్యాయమూర్తి చేత విచారించనున్నట్లు తెలిపారు. రెండు కేసుల విచారణ ప్రగతి దశలో ఉన్నాయని, ఈ రెండు కేసుల విచారణ సమయంలో బయట నుండి ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపుతున్నట్లు వైస్ చాన్స్‌లర్ తెలిపారు.

బైక్ ట్యాక్సీ సేవలకు కేంద్రం ఓకే..!

● వ్యతిరేకిస్తున్న ఆటో, ట్యాక్సీడ్రైవర్లు ● రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపైనే ఉత్కంఠ

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరు మహానగరంలో ట్రాఫిక్ అంటేనే ఒక పెద్ద చర్చ. ఆఫీసువేళల్లో రావాలన్నా పోవాలన్నా ఎంతసమయం పడుతుందో చెప్పలేని పరిస్థితి. ప్రజారవాణాలో బీఎంటీసీ బస్సులు, మెట్రోతోపాటు ఆటోలు, క్యాబ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఆటో, క్యాబ్ చార్జీలతో పోలిస్తే తక్కువ ధరకే బైక్‌ట్యాక్సీ సేవలు అందుబాటులో ఉన్నాయి. సొంత బైక్‌లపై సర్వీసు ఇస్తున్నారని, తాము పలు ట్యాక్స్‌లు చెల్లిస్తున్నామంటూ బైక్ ట్యాక్సీల వల్ల తమ ఉపాధి కోల్పోతోందంటూ పలు ఆటో సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సొంత ద్విచక్ర వాహనాలను రవాణా వాహనాలుగా ఎలా అనుమతిస్తారని ఇది కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకమని హైకోర్టు సూచించడంతో జూన్ 16న రాష్ట్రప్రభుత్వ బైక్ ట్యాక్సీ సేవలను రద్దు చేసింది. కాగా హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పును సవాల్ చేస్తూ ఫుల్‌బెంచ్‌ను బైక్‌సేవల సంస్థలు ఆశ్రయించాయి.

● ఈ నేపథ్యంలో బైక్ ట్యాక్సీ యాప్ సేవలందిస్తున్న ర్యాపిడో, ర్యాపిడో తదితర సంస్థలు అందుకు నిబంధనలు ఉంటే వాటిని పాటిస్తామంటూ తమ అభ్యంతరం వ్యక్తం చేశాయి. బైక్ ట్యాక్సీ సేవలు బెంగళూరుతోపాటు మైసూరు, మండ్య, దావణగెరె, రామనగర తదితర నగరాలలో ఉన్నాయి. బైక్ ట్యాక్సీసేవలలో అత్యధికంగా యువత ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తమ ఉపాధి కోల్పోతుందని పలుమార్లు నిరసన తెలిపారు. 2021లో ప్రారంభమైన ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీసేవలను మహిళల సురక్షత, చట్టాల లోపాల నేపథ్యంలో 2024లో రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకుంది.

కాగా కేంద్రప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ మంగళవారం పలు మార్గదర్శకాలు చేసింది. ప్రైవేట్ బైక్‌లను ప్రయాణీకుల సంచారానికి ఉపయోగించాలంటే అగ్రిగేటర్‌లు రాష్ట్రప్రభుత్వాల అనుమతి పొందాల్సి ఉంటుంది. దీంతో ట్రాఫిక్ రద్దీ, కాలుష్య నియంత్రణ, ధర నిర్ణయం, స్థానికులకు రవాణా సదుపాయ అవకాశాలు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వాలు మోటారు వాహనాల సెక్షన్ 67 సబ్ సెక్షన్ (3) కింద అగ్రిగేటర్‌లకు ప్రైవేట్ వాహనాలకు ప్రయాణీకుల సంచారానికి అవకాశం ఉందని పేర్కొంది. ఇందుకుగాను అగ్రిగేటర్‌ల నుంచి రోజువారీ, వారపు, పదిహేను రోజులకోసారి ట్యాక్స్ పన్ను విధించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనే ఉత్కంఠ నెలకొంది.



జలపాతాలు కళకళ



భరచుక్కి జలపాతం

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కంటే ముందస్తు వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. పశ్చిమకనుమల ప్రాంతంలో ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ప్రభావంతో దిగువన ఉండే ప్రాజెక్టులకు పుష్కలంగా నీరు చేరుతోంది ఇటీవల ఆల్మట్టి, నారాయణపురలకు వేలాది క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. కృష్ణానదికి అనుబంధమైన ప్రాజెక్టుల్లో నీరు క్రమేపీ చేరుతోంది. మరోవైపు కావేరీ నది పరీవాహక ప్రాంతాల్లో కూడా వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. దీంతో ఎన్నడూలేనంతగా కేఆర్ఎస్ ప్రాజెక్టు జూన్‌లోనే గరిష్టనీటిమట్టానికి చేరింది. మండ్య, మైసూరు, బెంగళూరు ప్రాంతాలకు కేఆర్ఎస్ డ్యాం జీవనాడిగా ఉంది. దశాబ్దాల తర్వాత జూన్‌లోనే కేఆర్ఎస్ డ్యాం 120 అడుగుల నీటిమట్టం దాటడంతో జూన్ 30న ముఖ్యమంత్రి సిద్దరామయ్య వాయనం సమర్పించారు. ఇది కూడా ఒక రికార్డుగా నిలిచింది. ఇలా ప్రముఖ ప్రాజెక్టులన్నీ తొణికిసలాడుతుండగా ప్రముఖ నదులకు అనుబంధంగా ఉన్న జలపాతాలు జలకళ సంతరించుకున్నాయి.



గోకాక్ ఫాల్స్

సందర్శకుల సందడి

కావేరి, కృష్ణా నదులకు అనుబంధంగా ఉండే పలు జలపాతాలు సోయగాన్ని సంతరించుకున్నాయి. జలపాతాల వద్ద సందర్శకుల సందడి మొదలైంది. పశ్చిమకనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఘటప్రభ నది పరవళ్ళు తొక్కుతోంది. దీని పరిణామం బెళగావి జిల్లాలో 'కర్ణాటక నయాగరా'గా పేరొందిన గోకాక్ జలపాతానికి జీవకళ వచ్చింది. ఇక్కడ అమెరికాలోని నయాగరా ఫాల్స్ తరహాలో బండలపై నుంచి నీరు ప్రవహించడం కనువిందు చేస్తోంది. సుమారు 52 అడుగుల ఎత్తునుంచి దూకే దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. మరోవైపు గోకాక్ గ్రామదేవత జాతర నేపథ్యంలో పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. శివమొగ్గ జిల్లాలో శరావతి నదికి అనుబంధంగా జోగ్ జలపాతం సైతం ఆకర్షణీయంగా ఉంది. ప్రకృతి రమణీయత నడుమ జలపాతాలు ఉండడంతో వీటిని వీక్షించేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా, రాష్ట్రవాసులే కాకుండా పొరుగున ఉండే మహారాష్ట్ర, గోవా వాసులు కూడా జలపాతాలను వీక్షించేందుకు వస్తున్నారు.

గగనచుక్కి భరచుక్కి జలపాతాలు

కావేరి నదికి అనుబంధంగా చామరాజనగర జిల్లాలో మండ్య సరిహద్దున శివనసముద్ర వద్ద గగనచుక్కి, భరచుక్కి జలపాతాలు పక్కపక్కనే ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో కనువిందు చేస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. మండ్య సమీపంలో ఉన్న బలమురి ఫాల్స్ కూడా జలకళను సంతరించుకుంది.



బలమురి జలపాతం



భరచుక్కి వద్ద పర్యాటకుల సందడి

జేడీఎస్ భారీ నిరసన

● గ్యారెంటీలు మినహా అభివృద్ధి శూన్యమని ఆగ్రహం



ఫ్రీడంపార్కు వద్ద నిరసన తెలుపుతున్న జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడిచినా నియోజకవర్గాల అభివృద్ధికి గ్రాంట్లు మంజూరు చేయకపోవడంతో ఎమ్మెల్యేలు తలెత్తెకోలేని పరిస్థితి నెలకొందని జేడీఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ అభిప్రాయపడ్డారు. నగరంలో బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బుధవారం ఫ్రీడంపార్కులో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం గ్యారెంటీలు అమలు చేస్తూ అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని ఆరోపించారు. అంతేకాక ప్రతిశాఖలోనూ పర్సంటెజీల వ్యవహారం పెరిగిందన్నారు. అవినీతి, లంచగొండితనం అధికమైందన్నారు. ప్రభుత్వం దివాళా తీసిందంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు వ్యాఖ్యానిస్తున్నారని ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేయదలిచామన్నారు. నిరసనలో మాజీ ఎమ్మెల్యే టీఎన్ జవరాయిగౌడ, మాజీ ఎమ్మెల్యే కేప తిప్పేస్వామి, బెంగళూరు నగర మహిళా విభాగం అధ్యక్షురాలు శైలా సంతోజిరావ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు అఫ్రోజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి, జూలై 2(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలోని నక్కనదొడ్డి తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 45 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని గుత్తిప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బోన్ క్యాన్సర్‌తో బీటెక్ విద్యార్థి మృతి


విష్ణువర్ధన్ (ఫైల్)

ధర్మవరం, జూలై 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి విష్ణువర్ధన్ (19) బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మరణించాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రాంనగర్‌కు చెందిన బద్దెల శోభన్‌బాబు, లక్ష్మి దంపతులు కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి కుమారుడు విష్ణువర్ధన్ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుండేవాడు. ఐదేళ్ల క్రితం ఆపరేషన్ చేయించారు. నయమైన వ్యాధి ఈ ఏడాది ఫిబ్రవరిలో తిరగదోడింది. బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్సలు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి విష్ణువర్ధన్ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. విష్ణువర్ధన్ తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు.

మహిళ అదృశ్యం


మల్లీశ్వరి

తనకల్లు, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంటపల్లికి చెందిన మల్లీశ్వరి కనిపించకుండా పోయింది. ఆమె తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్లీశ్వరిని నాలుగేళ్ల క్రితం కర్ణాటకలోని చింతామణి తాలూకా బీచుగానిహళ్లికి చెందిన వ్యక్తికిచ్చి వివాహం చేశారు. వీరికి కుమారుడు ఉన్నాడు. మల్లీశ్వరి నెల రోజుల క్రితం పుట్టినింటికి వచ్చింది. గతనెల 12న ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రిలో చూపించుకోవడానికి అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువుకు వెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను విచారించినా ఆచూకీ దొరకలేదు. దీనిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతుల మిస్సింగ్‌పై సిట్ వేయాలి

డీఎస్పీకి ఎన్ఎఫ్ఐడబ్ల్యూ వినతి

అనంతపురం క్రైం, జులై 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువతులు ఎక్కువగా అదృశ్యమవుతున్నారనీ దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నియమించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) నేతలు.. అనంతపురం డీఎస్పీ శ్రీనివాసురావును కోరారు. బుధవారం ఆ సంఘం నేతలు డీఎస్పీని కలిశారు. నేతలు పద్మావతి, లక్ష్మి యశోద, అరుణ మాట్లాడుతూ.. కొంతకాలంగా అనేక పోలీసు స్టేషన్ల పరిధిలో యువతుల మిస్సింగ్ కేసులు నమోదవుతున్నాయన్నారు. నగరంలో మహిళల భద్రతపై అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. ఈ మిస్సింగ్ కేసులపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. దీనిపై సిట్ వేయాలని కోరారు. ఈ మేరకు డీఎస్పీకి వినతిపత్రం అందించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

గోరంట్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీ ఢీకొనడంతో యువకుడి మృతిచెందాడు. మండలంలోని కదిరి ప్రధాన రహదారిపై కసిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. కదిరివైపు నుంచి కంటైనర్ లారీ పెనుకొండవైపు వెళ్తుండగా కసిరెడ్డిపల్లి సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని ఢీకొని వెళ్లిపోయింది. అతడు అక్కడికక్కడే మృతిచెందారు. అతడి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ శేఖర్ ఆధ్వర్యంలో కంటైనర్ లారీని పాలసముద్రం క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకుని దర్యాప్తుచేస్తున్నారు.

మాజీ వలంటీర్ మోసం

జనాభా లెక్కల పేరుతో రూ.10వేలు కొట్టేసిన వైనం

యాడికి, జూలై 2(ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల కోసం వచ్చానని చెప్పి ఓ దుండగుడు వేలి ముద్రల ద్వారా మహిళ ఖాతా నుంచి రూ.పదివేలు కాజేసిన సంఘటన యాడికిలో జరిగింది. కొండకింద వీధికి చెందిన బాధిత మహిళ మక్కల జయమ్మ తెలిపిన మేరకు... బుధవారం ఉదయం 8:30గంటల సమయంలో మాజీ వలంటీర్ ఇంటివద్దకు వచ్చి జనాభా లెక్కల కోసం వచ్చినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యుల వివరాలు, తన బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకున్నాడని బాధితురాలు తెలిపారు. వేలిముద్రలు తీసుకుని దుండగుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడన్నారు. ఇదంతా అనుమానంగా అనిపించడంతో బ్యాంక్ వద్దకు వెళ్లి వివరాలు చూసుకుంటే మాజీవలంటీర్ వేలిముద్ర వేయించుకున్న సమయంలోనే రూ.10వేలు డ్రా చేసినట్లు బ్యాంక్‌లో చెప్పారని బాధితురాలు వాపోయారు. ఆ మాజీ వలంటీర్ ఇంటివద్దకు వెళితే లేడని, అతడి ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ ఉందని తెలిపారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన జయమ్మ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అదానీ పవర్ ప్రాజెక్టు వద్ద ఘర్షణ

తాడిమర్రి, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులో నిర్మాణంలో ఉన్న అదానీ పవర్ ప్రాజెక్టు వద్ద కడప జిల్లా లింగాల మండలం పార్నపల్లికి చెందిన ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పార్నపల్లికి చెందిన వైసీపీ నాయకుడు అశోక్.. తాడిమర్రి మండల వాసులతో కలిసి అదానీ పవర్ ప్రాజెక్టులో కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. పార్నపల్లికి చెందిన ధనుంజయ, పుల్లానాయుడుతో పాత కక్షలు ఉన్నాయి. ఈనేపథ్యంలో మంగళవారం సాయంత్రం పవర్ ప్రాజెక్టు వద్ద ఇరువర్గాల వారి మధ్య వాగ్వాదం తలెత్తింది. దీంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. అశోక్ గాయపడ్డాడు.అశోక్ ఫిర్యాదు మేరకు ధనుంజయ, పుల్లానాయుడు, శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

కొత్తచెరువు, జూలై 2(ఆంధ్రజ్యోతి): స్థానిక హజరత్ మస్తాన్‌వలీ దర్గా కమిటీ ఎన్నికలకు సంబంధించి ముస్లింలు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని వక్ఫ్‌బోర్డు అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. జామియా మసీదు, జుమ్మామసీదు, హజరత్ మస్తాన్‌వలీ దర్గా మసీదులో నమోదు చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ముస్లిం అర్హుడన్నారు. ఈనెల 21వతేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి: డీఎంహెచ్ఓ

మడకశిర రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆటోలు, 108 వాహనాల్లో జరుగుతున్న ప్రసవాలపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం స్పందించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలకు స్పందించి, మడకశిర మండలం కదిరేపల్లి అర్బన్ హెల్త్‌సెంటర్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. కాన్పులు ఆసుపత్రిలోనే జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ నెలంతా డెంగీ నివారణ మాసోత్సవం నిర్వహించాలని, ప్రజలకు డెంగీ గురించి అవగాహన పెంచాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ వీరమ్మ, ఎస్ఓ కళాధర్, అసిస్టెంట్ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మనాయక్, ఐదు మండలాల వైద్యులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


డెంగీ మాసోత్సవం ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న డీఎంహెచ్ఓ, వైద్యులు, సిబ్బంది

ఇండస్ట్రీ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు

అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్‌తో ఎంఓయూ


ఎంఓయూ కుదుర్చుకుంటున్న జేఎన్‌టీయూ వీసీ తదితరులు

అనంతపురంరూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతమైన పారిశ్రామిక నైపుణ్యాలను పెంచుకుని, ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్‌తో సెంటర్ ఫర్ ఫ్యూచర్ స్కిల్స్ ఎస్టాబ్లిష్ చేయడానికి జేఎన్‌టీయూ బుధవారం ఎంఓయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈసందర్భంగా జేఎన్‌టీయూ వీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోందన్నారు. విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్‌లో తర్ఫీదు ఇవ్వటానికి ఈ అవగాహన ఒప్పందం దోహద పడుతుందన్నారు. ఈ ఒప్పందం అనుబంధ కళాశాలలతోపాటు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య మాట్లాడుతూ.. ఎంఓయూలో ఎన్ఎస్‌డీసీ, అడ్వాన్స్ లేబొరేటరీస్, డ్రోన్ కిట్స్, ఐఓటీ, అటానమస్ సిస్టమ్స్, క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన ల్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, కిశోర్, వర్సిటీ ఓఎస్‌డీ ఆచార్య దేవన్న, డైరెక్టర్లు, సత్యనారాయణ, భానుమూర్తి, వైశాలిగోస్వాడే, సుబ్బారెడ్డి, సుజాత, పద్మసువర్ణ, కిరణ్మయి, నాగప్రసాద్‌నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, సురేష్‌బాబు, జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు వద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


క్యూఆర్ కోడ్ పత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, జూలై2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. విద్యుత్ ధరల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ ప్రజలు తమ వ్యతిరేకతను చాటేందుకు రూపొందించిన క్యూఆర్ కోడ్‌లను బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. రాంభూపాల్ మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లు పెట్టబోమనీ, ట్రూఅప్ చార్జీలు, సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టాక వాటిని విస్మరించడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చాలనీ, లేనిపక్షంలో ప్రజలందరినీ కలుపుకుని ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్ రెడ్డి, నగర కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే ఉద్యోగాలు ఊడుతాయ్..!

బదిలీలపై సిబ్బందికి డీపీఓ వార్నింగ్

అనంతపురం న్యూటౌన్, జూన్2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్స్ బదిలీలలో అక్రమాలకు పాల్పడితే ఉద్యోగాలు ఊడుతాయని డీపీఓ నాగరాజానాయుడు హెచ్చరించారు. బదిలీలపై తన కార్యాలయంలో బుధవారం సుదీర్ఘంగా సమీక్షించారు. బదిలీల జాబితాలో లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. నాయకుల నుంచి సిఫార్సుల నేపథ్యంలో డీపీఓపై ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల అనుమతితో, ముఖ్యమైన సిఫార్సులపై నిర్ణయం తీసుకుంటానని ఆయన చెప్పినట్లు సమాచారం. డీపీఓ కార్యాలయానికి బుధవారం సైతం సిబ్బంది తమ సమస్యలు చెప్పుకోవడానికి క్యూ కట్టారు. డీపీఓ అందుబాటులో ఉండటంతో కొందరు కలిసి, సమస్యలు చెప్పుకున్నారు. కొన్నింటికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, మరికొన్నింటిని సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం. బదిలీల జాబితా గురువారం సిద్ధమయ్యే అవకాశం ఉంది.

అప్పులు ఎక్కువై..

భార్యతో గొడవపడి..!

ధర్మవరం, జూలై 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రియాంక నగర్‌కు చెందిన లింగారెడ్డి(48) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపిన మేరకు, లింగారెడ్డి వంట పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయనకు అప్పులు ఎక్కువై, వాటిని ఎలా తీర్చాలో తెలియక ఒత్తిడికి లోనయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. అప్పుల విషయంలో భార్య లక్ష్మీదేవితో బుధవారం సాయంత్రం గొడవపడ్డాడు. విచక్షణ కోల్పోయి, ఆమె తలపై కర్రతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీదేవి, అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయిందని భయపడ్డాడు. ఈ క్రమంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మీదేవి పరిస్థితి విషమంగా ఉండటంతో కుమారుడు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.


చంపేసేటోడే..!

అనంతపురం క్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భార్యను చంపేందుకు ప్రయత్నించాడు భర్త. చున్నీతో గొంతు బిగించి, విష రసాయనం తాగించే ప్రయత్నం చేశాడు. ఇరుగూ పొరుగు గమనించి అడ్డుకోవడంతో ఆమె ప్రాణాలతో బయట పడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు, భవానీ నగర్‌కు చెందిన ధనలక్ష్మితో మునీంద్రకు 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కూతుళ్లు. మునీంద్ర తన భార్యతో తరచూ గొడవ పడేవాడు. వివాదం ముదిరి, బుధవారం ఆమెను చంపబోయాడు. స్థానికులు అడ్డుకుని, ఆమెను వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు చికిత్స పొందుతున్నారు. ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

మెడికల్ కాలేజీ అకౌంటెంట్ అరెస్టు

అనంతపురం క్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం మెడికల్ కాలేజీ అకౌంటెంట్ ఓబులేశ్వరి(43) అలియాస్ వాణిని టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మెడికల్ కాలేజీ హాస్టల్‌లో మెస్ కోసం విద్యార్థులు చెల్లించిన ఫీజులు దుర్వినియోగం కావడంతో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విద్యార్థి సంఘాల నేతలు ధర్నాలు చేయడం, వివాదం ముదరడంతో వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు వచ్చి విచారించారు. సుమారు రూ.26 లక్షలు కాజేశారని గత నెలలో అప్పటి ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితురాలైన అకౌంటెంట్‌ను అరెస్టు చేశామని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.

రూ.వంద కోసం కత్తితో దాడి


గాయపడిన నరసింహులు

నంబులపూలకుంట, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో రూ.వంద అప్పు చెల్లించే విషయమై బుధవారం కత్తితో దాడి చేశాడు. బాధితుడు నరసింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీమలచెరువుపల్లికి చెందిన రవీంద్రారెడ్డి ఓ మహిళ వద్ద రూ.వంద అప్పు తీసుకున్నాడు. రవీంద్రారెడ్డి, నరసింహులు బుధవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళ అప్పు విషయం ప్రస్తావనకు వచ్చింది. 'అప్పు చెల్లించావా' అంటూ రవీంద్రారెడ్డిని నరసింహులు అడిగాడు. దీంతో ఆగ్రహం చెందిన రవీంద్రారెడ్డి సమీపంలోనే ఉన్న దుకాణంలో కత్తి కొనుగోలు చేసి, తీసుకొచ్చి గొంతుపై దాడిచేసి, గాయపరిచాడు. ఇరువురు పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు. గాయపడిన నరసింహులును అన్నమయ్య జిల్లా కేంద్రానికి ప్రైవేటు వాహనంలో తరలించారు. రవీంద్రారెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

ఆర్ఎస్‌కే సిబ్బంది బదిలీ ఉత్తర్వులు జారీ

అనంతపురం అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బందికి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 250 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 315 విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 110 మంది పశుసంవర్ధక శాఖ సహాయకులకు బదిలీ చేశారు. తక్షణమే కొత్త స్థానాల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

మద్యం దుకాణానికి ఒక్కటే దరఖాస్తు

అనంతపురం క్రైం, జులై 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికులకు రిజర్వ్ చేసిన నాలుగు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా ఒక్క దుకాణానికి మాత్రమే వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలో రాయదుర్గం రూరల్ మండలంలో గౌండ్ల కులస్థులకు, డీ హీరేహాళ్ మండలంలో గౌడ కులస్థులకు, గుత్తి రూరల్ మండలంలోని గౌడ్ కులస్థులకు, కంబదూరు మండలంలో ఈడిగ కులస్థులకు మద్యం షాపులు రిజర్వ్ చేశారు. వాటిని గత నెల 30 వరకూ ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గుత్తి రూరల్ మండలంలోని షాపునకు ఒక దరఖాస్తు మాత్రమే వచ్చింది. పోటీలేకపోవడంతో దరఖాస్తు చేసిన గొల్లపల్లి రాముకు షాపు నిర్వహణకు లైసెన్సు మంజూరు చేసినట్లు తెలిపారు. మిలిగిన మూడు షాపులకు ఎలాంటి దరఖాస్తులు రాలేదు. వీటికి త్వరలో మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు.

లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే మద్యం కొనాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి

అనంతపురం క్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే మద్యం కొనాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి బుధవారం ప్రకటనలో సూచించారు. లైసెన్స్ లేని, అనధికార వ్యక్తుల ద్వారా మద్యం కొనడం ప్రమాదకరం అన్నారు. పెళ్లిళ్లు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకలకు మద్యం తక్కువ ధరకు విక్రయిస్తామంటూ మోసం చేసే అవకాశం ఉందన్నారు. అలాంటి వారు విక్రయించే మద్యం నకిలీదయ్యే అవకాశం ఉందన్నారు. నాణ్యతలేని, నకిలీ మద్యం వల్ల ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఎవరైనా, ఎక్కడైనా అనుమానితులు ఇలా వ్యవహరిస్తుంటే... ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 14405కిగానీ, జిల్లా ఎక్సైజ్ అధికారికి 9989628308 నంబరులోగానీ ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

మొబైల్ టవర్లు ఏర్పాటు చేయండి

జియో సీఈఓకు మంత్రి లేఖ

ధర్మవరం, జూలై 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెట్‌వర్క్ లోపాలున్న గ్రామాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలని జియో సీఈఓకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ముదిగుబ్బ, ధర్మవరంరూరల్ మండలాల్లోని 24 గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య ఉందనీ, ఫలితంగా విద్య, అత్యవసర వైద్యం, డిజిటల్ సేవలు, ఈ-గవర్నెన్స్ వంటి ప్రాథమిక అవసరాలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మంత్రి లేఖలో ప్రస్తావించారు. ఆయా గ్రామాలకు నెట్‌వర్క్ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, జూలై2 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఉత్తమ అవార్డుల కోసం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి టీచర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈఅవార్డులకు అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ అర్హులే అన్నారు. దరఖాస్తుకు సంబంధించి కేంద్రమంత్రిత్వ శాఖ పొందుపరిచిన మార్గదర్శకాలను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా సమగ్రశిక్ష బదిలీలు

అనంతపురం విద్య, జూలై 2(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష పరిధిలో బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అందులో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న సీఆర్‌టీలు, సీఆర్‌పీలు, ఆపరేటర్లు, వాచ్‌మెన్‌కు బుధవారం మ్యూచువల్, రిక్వెస్ట్ బదిలీలు చేపట్టారు. సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ శైలజ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కోరుకున్న ప్లేస్‌లు వచ్చినవారు ఆనందంగా వెళ్లారు. చాలామంది సిబ్బంది దరఖాస్తు చేసుకున్న ప్లేస్‌లు లేకపోవడంతో నాట్ ఆప్టెడ్ ఇచ్చి వెళ్లడం కనిపించింది. అలా కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో జీసీడీఓ కవిత, అసిస్టెంట్ సీఎంఓ ఫణిరాజ్, సూపరింటెండెంట్ ఇక్బాల్ పాల్గొన్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

అధికారుల ఏకపక్ష ధోరణికి నిరసన: పుల్లారెడ్డి

పెనుకొండ, జూలై 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రై వేట్ విద్యాసంస్థల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ పుల్లారెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. సరైన ధ్రువీకరణ లేని ఫిర్యాదుల ఆధారంగా షోకాజ్ నోటీసులు జారీచేయడం, గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం, పక్షపాత ధోరణితో తనిఖీలు చేయడాన్ని నిరసిస్తూ బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు.

మేము పాల్గొనం: ఏడీపీఎస్ఏ

అనంతపురం విద్య, జూలై2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి కొన్ని సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం చేపడుతున్న బంద్‌లో తాము పాల్గొనడంలేదని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(ఏడీపీఎస్ఏ) నాయకులు పేర్కొన్నారు. కమలానగర్‌లోని జిల్లా కార్యాలయంలో సంఘం నేతలు బుధవారం సమా వేశమై చర్చించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గంగాధర్, జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఉమ్మడి జిల్లాల సీఆర్ఓ రవిచంద్రారెడ్డి తదితరులు మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండానే బంద్‌కు పిలుపునివ్వడం సరికాద న్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందన్నారు. అందుకే గురువారం జరిగే పాఠశాలల బంద్‌లో ఏడీపీఎస్ఏ పాల్గొనడంలేదన్నారు. పాఠశాలలు యథాతథంగా నిర్వహించాలని వారు కోరారు. సమావేశంలో ఏడీపీఎస్ఏ నాయకులు రామచంద్ర, చంద్రశేఖరరెడ్డి, భాస్కరరెడ్డి, శ్రీవాత్సవ, జానకీరామ్, రఫీ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి: యూటీఎఫ్

అనంతపురం విద్య, జూలై2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి జయచంద్రా రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి తదితరులు జడ్పీ పీఎఫ్ అకౌంట్ ఆఫీసర్‌ను బుధ వారం కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయుల పీఎఫ్ సొమ్ము, పేస్లిప్పులు 2021వరకు మాత్రమే అప్డేట్‌లో ఉన్నాయని, అవికూడా ఒక్కోసారి డిస్‌ప్లే కావడం లేదన్నారు. చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలో 2025వరకు అన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. ఈ జిల్లాలో కూడా ఉపాధ్యాయుల పీఎఫ్ సొమ్మును ఖాతాల్లోకి పూర్తి స్థాయిలో జమ చేసి అప్డేట్ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆమేరకు అకౌంట్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

మల్టీ డే క్రికెట్ పోటీల్లో చిత్తూరుకు ఆధిక్యం


శశాంక్ శ్రీవత్స దీపన్‌సాయినాథ్ సూర్యచరణ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మల్టీ వన్డే క్రికెట్ పోటీల్లో చిత్తూరు జట్టు ఆధిక్యంలో నిలిచింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ మల్టీ వన్డే క్రికెట్ పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 38.4 ఓవర్లలో 125పరుగులకు ఆలౌట్ అయ్యింది. చిత్తూరు బౌలర్లు సూర్యచరణ్, దీపన్‌సాయినాథ్ చెరో ఐదు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన చిత్తూరు 33ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 194పరుగులు చేసింది. బ్యాటర్లు శశాంక్‌శ్రీవత్స 104, జ్ఞానేశ్వర్ 89పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో కర్నూలు-నెల్లూరు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు 70 ఓవర్లలో 8వికెట్లకు 208పరుగులు చేసింది. బ్యాటర్లు సంజయ్‌నాయుడు 85, సూర్యతేజ 61పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు సాత్విక్ 3వికెట్లు, నారాయణ 2వికెట్లు తీశారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాల పంట



పతకాలు సాధించిన విజేతలతో సభ్యులు, కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు భారీగా పతకాలు దక్కాయి. ఇటీవల విజయవాడలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 18పతకాలు సాధించారు. అండర్-10 విభాగంలో సాద్విన్, ఆర్య, మోహన్‌కృష్ణ, గౌతమ్‌కృష్ణ, చైత్ర, అస్మితభాయ్, అన్వి చౌదరి విజేతలుగా నిలిచారు. అండర్-12లో అబ్దుల్లా, దుర్గావియాన్ యాదవ్, జస్వంత్‌రెడ్డి, బాబాఫకృద్దీన్, ఫణికుమార్, జావీద్, ముక్తామేక, వీక్ష, లిఖితభాయిలు విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి, ఖేలో ఇండియా కోచ్ లక్ష్మి, కోచ్ రాహుల్‌లు అభినందించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఈనెల 5, 6, 7 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు.

బూదిలి వంతెనకు మంత్రి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామ సమీపాన చిత్రావతి నదిపై రూ.8.52 కోట్ల వ్యయంతో తలపెట్టిన హైలెవల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత బుధవారం భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చామన్నారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేయించి ఇచ్చిన మాట నిలుపుకున్నామన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా చిత్రావతి నది ఉధృతికి రెండుమార్లు వంతెన కొట్టుకుపోగా.. నామమాత్రపు పనులు చేపట్టారే తప్ప.. శాశ్వత పరిష్కారానికి కృషి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. గోరంట్ల పారిశామిక వాడగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వంతెన నిర్మాణం ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు, తహసీల్దార్ మారుతి, పీఆర్ డీఈ తిరుమలరెడ్డి, టీడీపీ నాయకులు బాలకృష్ణ, సోమశేఖర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, నిమ్మలశ్రీధర్, సర్పంచ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సూర్యదేవర సంజీవ దేవ్ (జయంతి)



ప్రముఖ రచయిత డాక్టర్ సూర్యదేవర సంజీవదేవ్ 1914 జూలై 3న గుంటూరు జిల్లా తుమ్మపూడిలో జన్మించారు. తత్వవేత్త, చిత్రకారుడు, కవి, మానవతావాదిగా రాణించారు. 'ఏ ప్రాంతమూ పరాయి కాదు ఏ మనుషులూ పరాయివారు కారనే' వసుధైక కుటుంబ సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణలో పెట్టారు. బాల్యంలోనే ఇల్లు వదిలి దేశసంచారం చేశారు. 20ఏళ్లలోపే హిమాలయాలు సహా ఉత్తర భారతదేశం అంతా పర్యటించారు. హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఫ్రెంచ్ జపనీస్ నేర్చు కున్నారు. సమకాలీన ప్రపంచ మేధావులందరితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు. ఆయన నివసించే తుమ్మపూడి గ్రామానికి దేశవిదేశాల కళాకారులు, సాహిత్యోపాసకులు ఆయనకోసం వచ్చేవారు. 1999 ఆగస్టు 25న కన్నుమూశారు.

ఎస్వీ రంగారావు (జయంతి)



ఎస్వీఆర్‌గా పేరొందిన సామర్ల వెంకట రంగారావు 1918 జూలై 3న కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించారు. సినీ నటుడు, దర్శకుడు, రచయిత. నాటకాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఫైర్ ఆఫీసర్‌గా కొంతకాలం పనిచేశారు. నటనకోసం ఉద్యోగానికి రాజీనామా చేశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో మూడు దశాబ్దాల పాటు 300కుపైగా చిత్రాలలో నటించారు. 'రాష్ట్రపతి అవార్డు', నంది అవార్డు, ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ తదితర అవార్డులు అందుకున్నారు. ప్రతి నాయక పాత్రల్లోనూ, అనేక సహాయపాత్రలలోనూ తనదైన ముద్ర వేశారు. విశ్వనట చక్రవర్తి, నట సార్వభౌమ, నటసింహ తదితర బిరుదులు పొం దారు. 1974 జూలై 18న గుండెపోటుతో కన్నుమూశారు.

ఎంఎస్ రామారావు (జయంతి)



తెలుగు సినీ రంగంలో తొలి నేపథ్య గాయకుడు గాయకుడు, స్వర కల్పనలో పేరొందిన ఎంఎస్ రామారావు 1921 జూలై 3న గుంటూరు జిల్లా తెనాలి ప్రాంతం మోపర్రులో జన్మించారు. ఆధ్యాత్మిక పాటలు ఆలపించడంలో పేరొందారు. ప్రత్యేకించి ఆయన గేయ రూపంలో ఆలపించిన 'సుందరకాండము' ఎంతో పేరొందింది. తులసీదాసు రచించిన 'హనుమాన్ చాలీసా'ను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఈ రెండూ ఆయనకు ఎంతో గుర్తింపు తెచ్చాయి. లలిత గీతాలతోపాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతంలోనూ పాటలు పాడారు. సుందరకాండతో ఆయన 'సుందరదాసు'గా పేరొందారు. 1992 ఏప్రిల్ 20న కన్నుమూశారు.

బలివాడ కాంతారావు (జయంతి)



కేంద్రీయ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీ ప్రముఖ తెలుగు నవలా రచయిత బలివాడ కాంతారావు 1927 జూలై 3న శ్రీకాకుళం జిల్లా మండపంలో జన్మించారు. ఇండియన్ నేవీలో వివిధ హోదాలలో కొనసాగారు. 38 నవలలు, 400 చిన్నకథలు, 5 నాటికలు రచించారు. రేడియో కథలు, నాటకాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గోపీచంద్ సాహిత్య పురస్కారం, కళాసాగర్ విశిష్ట పురస్కారం అందుకున్నారు. 2000 మే 6న కన్నుమూశారు.

ఎంఎల్ వసంతకుమారి (జయంతి)



ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత మద్రాస్ లలితాంగి (ఎంఎల్) వసంతకుమారి 1928 జూలై 3న మద్రాస్‌లో జన్మించారు. నేపథ్య గాయకురాలిగా రాణించారు. గాయనీమణులు ఎంఎస్ సుబ్బులక్ష్మి, డీకే పట్టమ్మాళ్‌లకు సమకాలీనులు. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, ఇంకా సంగీత కళానిధి బిరుదు తదితర అవార్డులు అందుకున్నారు. 1990 అక్టోబరు 31న కన్నుమూశారు.

జ్యోతి సురేఖ వెన్నం (పుట్టినరోజు)



జాతీయస్థాయిలో పేరొందిన విలు విద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం 1996 జులై 3న జన్మించారు. విలువిద్యలో బాల్యం నుంచే ఆసక్తి ఉండగా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 70కుపైగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మెడల్స్ అందుకున్నారు. 2022 ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని 3 బంగారు పతకాలు సాధించి రికార్డు నెల కొల్పారు. నాల్గో యేట కృష్ణానదిని ఈది లిమ్కా రికార్డు సృష్టించారు. 2011 నుంచి విలువిద్య (ఆర్చరీ)లో తనదైన ప్రతిభతో రాణిస్తున్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలో ఇద్దరు వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యాయత్నం చేశారు. మండలంలోని శీనప్పపల్లిలో భర్త రామాంజనేయులు మందలించారని అనురాధ మనస్తాపం చెంది, ఆత్మహత్యకు యత్నించింది. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ తేజశ్విని చికిత్స చేశారు. నేసేవాండ్లపల్లికి చెందిన శివప్ప భార్య వరలక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.

నరేగా పనులు గ్రామ పరిధిలోనే కొనసాగాలి

గ్రామ పంచాయతీ సభ్యుల సమాఖ్య డిమాండ్



సామర్థ్యసౌధ వద్ద గ్రామపంచాయతీ సభ్యుల బృందం

ముళబాగిలు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి ఉపాధి హామీ పథకం (నరేగా) కింద చేపట్టే పనులు గ్రామ పరిధిలోనే కొనసాగాలని గ్రామపంచాయతీ సభ్యుల మహా ఒక్కూట తాలూకా అధ్యక్షుడు పెత్తాండ్లహళ్ళి పీవీ శంకర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సామర్థ్యసౌధలో గ్రామపంచాయతీ సభ్యుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కొన్నిచోట్ల ఉపాధి హామీ పనులు గ్రామపరిధి దాటి జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. రానున్నరోజుల్లో తమ గడువు ముగిసేలోగా మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఉపాధి హామీని సద్వినియోగం చేసుకుంటామన్నారు. నరేగా, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లను గ్రామాలలో మౌలిక సదుపాయాల ప్రగతికోసం ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో అధ్యక్షుడు సహా సభ్యులంతా గ్రాంట్లను సద్వినియోగం అయ్యేలా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. రైతులకు ప్రాధాన్యత మేరకు వ్యవసాయ కుంటలు, పశువుల పాక, గొర్రెలపాక ఇతరత్రా వాటిని నరేగా కింద చేపట్టాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటికీ గంగ పేరిట చేపట్టే తాగునీటి కనెక్షన్ల పనులలో నాణ్యత పాటించేలా చూడాలని, లోపాలు లేకుండా చూడాలని కాంట్రాక్టర్‌లకు సూచించాలన్నారు. గ్రామాలలో స్వచ్ఛత పాటించడం, తాగునీటి ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మాణం, పాఠశాలల్లో సంప్, అంగన్‌వాడీ కేంద్రాలకు సంప్, ట్యాంకులను స్వచ్ఛపరచడం, చెత్త నిర్వహణ వంటి పనులపై చర్చలు జరిపారు. గ్రామపంచాయతీ సభ్యులు మహా ఒక్కూట తాలూకా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు మల్లేకుప్ప అంబరీశ్, ఉత్తనూరు చంద్రప్ప, తమ్మేగౌడ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగృతి



సర్జాపురలో ప్లకార్డులతో ర్యాలీ

దొమ్మసంద్ర, జూలై 2(ఆంధ్రజ్యోతి): బెస్కాం ఎంత కట్టుదిట్టమైన నియమాలు జారీ చేసినా మనిషి నిర్లక్ష్యం, అవగాహన లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బెస్కాం అత్తిబెలె ఉపవిభాగం సహాయక కార్యవర్గ ఇంజనీర్ రాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. బుధవారం సర్జాపుర పట్టణంలో బెస్కాం ఆధ్వర్యంలో ప్రత్యేక జాగృతి నిర్వహించారు. జాతీయ విద్యుత్ సురక్షతా వారోత్సవ జాగృతి జాథాకు శ్రీకారం చుట్టారు. విద్యుత్ సమస్యలకు సంబంధించి హెల్ప్‌లైన్ 1912కు ఫోన్ చేయాలని లేదా సమీపంలోని బెస్కాం అధికారుల దృష్టికి తేవాలన్నారు. జాగృతిలో సర్జాపుర బెస్కాం అసిస్టెంట్ ఇంజనీర్ మోహన్‌కుమార్ నేతృత్వంలో పురవీధులలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ కాంట్రాక్టర్‌ల సంఘం అధ్యక్షుడు శివానందరెడ్డి, సహాయక ఇంజనీర్ మోహన్‌కుమార్, విష్ణువర్ధన్, నారాయణస్వామి, ఎల్ఎన్‌రెడ్డి, సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎస్‌వై శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపట్ల అప్రమత్తంగా ఉండాలి

శిడ్లఘట్ట(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోత విధించినా లేదా సరఫరాలో ఉన్నా విద్యుత్ తీగలపట్ల అప్రమత్తంగా ఉండాలని కేపీటీసీఎల్ తాలూకా నోడల్ అధికారి జేఎం జయరాం అభిప్రాయపడ్డారు. పట్టణంలోని వాసవి విద్యాసంస్థ ఆవరణలో నగరసభ బెస్కాం సిబ్బంది ఏర్పాటు చేసిన జాగృతిలో పాల్గొని మాట్లాడారు. రోడ్డుపై ఎక్కడైనా తెగిపడిన విద్యుత్ తీగను గుర్తించినా, వేలాడుతున్నట్టు చూసినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే బెస్కాం కు సమాచారం అందించాలన్నారు. విద్యుత్‌షాక్ కారణంగా ఇతరుల ప్రాణాలకు ఇబ్బంది కలగకుండా వ్యవహరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే బెస్కాం హెల్ప్‌లైన్ 1912కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు. బెస్కాం సహాయక ఇంజనీర్ అశోక్ మాట్లాడుతూ ఇళ్లలోని విద్యుత్ స్విచ్, ఇతర ఉపకరణాలు మరమ్మతుకు గురైతే ఎటువంటి సురక్షతా జాగ్రత్తలు లేకుండా చర్యలు చేపట్టరాదన్నారు. సహాయక ఇంజనీర్ అనంత్‌గౌడ మాట్లాడుతూ తగిన విద్యుత్ సురక్షతా చర్యలు పాటించడం ద్వారా షాక్‌కు లోను కాకుండా ఉండే అవకాశం ఉందన్నారు. వాసవి విద్యాసంస్థ పాలనాధికారి రూపసి రమేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బెస్కాం అధికారులు

బాగేపల్లి ఇకపై 'భాగ్యనగర'గా అధికారిక ప్రకటన



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సందడి



కన్నడ పతాకాలతో కరవే కార్యకర్తలు

తాలూకాలో సంబరాలు, ర్యాలీలు

బాగేపల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన బాగేపల్లికి నందికొండలపై బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'భాగ్యనగర'గా తీర్మానించి మరునామకరణం చేస్తూ అధికారికంగా ప్రకటించారు. కొంతకాలంగా భాగ్యనగర పేరు పెట్టాలంటూ స్థానిక ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు సాకారం కావడంతో అధికార కాంగ్రెస్, కరవే నాయకులు, కార్యకర్తలు, మహిళలు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి కార్యాలయం వద్ద బావుటాలు ఎగురవేసి సంబరం జరిపారు. పట్టణంలోని డీవీజీ రోడ్డుపై బాణాసంచా కాల్చి ప్రజలకు, వీధి వ్యాపారులకు మిఠాయిలు పంచిపెట్టారు. సుదీర్ఘకాల పోరాటానికి విజయం దక్కిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఘంటంవారిపల్లి గ్రామపంచాయతీ అధ్యక్షుడు హెచ్ఎస్ నవీన్, ఏవీ పూజప్ప, మహ్మద్ ఎస్ నూరుల్లా, అంజనేయరెడ్డి, కరవే నారాయణగౌడ వర్గం హరీశ్ స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతలు అండగా నిలవాలి

ముళబాగిలు, జూలై 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు దాతలు అండగా నిలవాలని ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని ఆవణి గ్రామ ప్రభుతత్వ కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో జై కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు లేఖనా సామగ్రి, బ్యాగును ఉచితంగా పంపిణీ చేశారు. 270మంది విద్యార్థులకు బ్యాగు, లేఖనా సామగ్రి అందచేయడం స్వాగతార్హంగా హెచ్ఎం ప్రకాశ్ పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులందరి సహకారంతో ఇటీవలిరోజుల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమాలను సక్రమంగా విద్యార్థులకు అందేలా చేస్తున్నామన్నారు. అదే రీతిన దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. జైకిసాన్ సంస్థ వ్యవస్థాపకులు మనోహర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జిల్లాలో ఒక పాఠశాలను ఎంపిక చేసి అక్కడి విద్యార్థులకు బ్యాగు, లేఖనా సామగ్రి ఇస్తున్నామని ఈసారి ఆవణి పాఠశాల ఎంపిక చేసినట్టు తెలిపారు. కళాకారుడు ఆవణి గోపి మాట్లాడుతూ జైకిసాన్ సంస్థ సామాజికసేవలను గుర్తించి అధికారులను సంప్రదించి తమ పాఠశాల విద్యార్థులకు సహకారం అందించాలని కోరగా సానుకూలం వ్యక్తం చేశారని, సంస్థ పదాధికారులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన గజేంద్ర, ప్రవీణ్, కార్తీక్, అరవింద్, పూర్వ విద్యార్థులు సుభాష్, గోపి, ఉపాధ్యాయులు ఆర్‌వీ చంద్రప్ప, వీణ, చిదానంద, భాగ్య, సీమం టజుళ, ఎస్ వరలక్ష్మి, శ్వేత, చైత్ర తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులతో విద్యార్థులు, దాతలు

వీధి వ్యాపారుల ఆందోళన



ఫ్రీడం పార్కులో నిరసన తెలుపుతున్న వీధి వ్యాపారులు

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల సంక్షేమంకోసం చట్టాలు ఉన్నా వాటిని సమగ్రంగా అమలు చేయడం లేదని, గ్రేటర్ బెంగళూరు పేరిట ప్రత్యామ్నాయ వ్యవస్థ కల్పించకనే తొలగించడం సరికాదని కరునాడు వీధి వ్యాపారుల సమాఖ్య అభ్యంతరం వ్యక్తం చేసింది. నగరంలో బుధవారం ఫ్రీడంపార్కులో సమాఖ్య ఆధ్వర్యంలో పలు డిమాండ్లను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్ నేతృత్వంలో నిరసన కొనసాగింది. అనంతరం సురేశ్ మాట్లాడుతూ 2014 యాక్ట్ ప్రకారం వ్యాపార వర్గాలుగా పరిగణించి స్థలావకాశం కల్పించాలని కోరుతున్నామన్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం, వారే చట్టాలను ఉల్లంఘించడం ద్వారా తమకు అన్యాయం జరుగుతోందని వాపో యారు. వీధి వ్యాపారుల గురించి సర్వే చేయాలని, పట్టణ వ్యాపార సమితి ద్వారా గుర్తింపు కార్డు మంజూరు చేయాలన్నారు. స్థానిక సంస్థల పరిధిలో వీధివ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఒక ప్రత్యేక కమిటీ వేయాలన్నారు. నిరసనలో వెయ్యిమందికిపైగా వీధివ్యాపారులు , సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాశ్చెరువు అధ్యక్షురాలు రేవతి రాజీనామా

అవిశ్వాస నిర్ణయం రద్దు - త్వరలో ఎన్నికలు

బాగేపల్లి/చేళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకాలోని రాశ్చెరువు గ్రామపంచాయతీ అధ్యక్షస్థానానికి రేవతి రాజీనామా చేశారు. రెండేళ్ల క్రితం ఎస్సీ వర్గానికి చెందిన రేవతి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. అయితే ఇటీవల ఆమెకు వ్యతిరేకంగా 10మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం చేపట్టాలని ఉపవిభాగాధికారికి విన్నవించగా జూలై 2గా నిర్ణయించారు. కాగా ఒకరోజు ముందు అంటే 1న మంగళవారం ఆమె తన పదవికి రాజీనామా చేస్తూ చిక్కబళ్ళాపుర ఉపవిభాగాధికారికి లేఖ సమర్పించారు. రాజీనామాను ఆమోదించారు. దీంతో బుధవారం ఉదయం 11 గంటలకు 14మందికిగాను 11మంది సభ్యులు కార్యాలయానికి వచ్చి అవిశ్వాస తీర్మానాన్ని కోరుతూ సంతకాలు చేశారు. నందికొండలపై మంత్రివర్గ సమావేశం కారణంగా ఉన్నతాధికారులు అందుబాటులో లేరు. పీడీఓ భాగ్యమ్మ అక్కడికి చేరుకుని రేవతి అధ్యక్షపదవికి రాజీనామా చేయడంతో అవిశ్వాస తీర్మానం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. త్వరలోనే ఎన్నికల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. అవిశ్వాస నిర్ణయానికి గ్రామపంచాయతీ సభ్యులు ఉపాధ్యక్షుడు గోవిందరెడ్డి, లీలావతమ్మ బాబురెడ్డి, భానుప్రకాష్, కేఎస్ నాగిరెడ్డి, శ్యామలమ్మ చౌడప్ప, సరస్వతమ్మ నాగేశ్, లక్ష్మీనరసమ్మ, కమలమ్మ సోమశేఖర్‌రెడ్డి, సీ వీరాంజనేయులు, చిన్నమద్దిరెడ్డి, కేసీ చౌడప్ప సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు ఏవీ పూజప్ప, డీఎస్ఎస్ ప్రముఖుడు కోటప్ప, విశ్వనాథరెడ్డి, శామీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపనుల శాఖ ఉద్యోగికి వీడ్కోలు



పద్మావతమ్మకు సన్మానం చేస్తున్న దృశ్యం

శిడ్లఘట్ట, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రజాపనులశాఖలో 26 సంవత్సరాల పాటు ఉత్తమ సేవలు అందించి రిటైరైన ఫస్ట్‌గ్రేడ్ అసిస్టెంట్ పద్మావతమ్మకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రజాపనులశాఖ కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో ప్రజాపనులశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ శిడ్లఘట్టలో సుదీర్ఘకాలం సేవలందించిన పద్మావతమ్మ అందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. తాను మరోశాఖ నుంచి ఇక్కడకు వచ్చిన కొత్తలో ఎలా విధులు నిర్వహించాలో సలహా, సూచనలు చేశారన్నారు. ఆమె రిటైర్మెంట్ జీవనం ఆరోగ్యంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పద్మా వతమ్మ భర్త చంద్రశేఖర్, ఇంజనీర్‌లు దినేశ్, ప్రియాంక, అనిల్ ఎస్ఎన్, సుప్రియరాణి, శ్రీనివాస్, నరసింహరెడ్డి, ప్రభుత్వ అతిథిగృహానికి చెందిన దేవరాజ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అమూల్యం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్‌కు సన్మానం

శిడ్లఘట్ట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర సమాజంలో వైద్యుల సేవలు అమూల్యమైనవని లయన్స్‌క్లబ్ తాజా మాజీ అధ్యక్షుడు మనోహర్ అభిప్రాయపడ్డారు. ప్రపంచవైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇద్దరు వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా కరోనా వైరస్‌తో తల్లడిల్లినవేళ తమ ప్రాణాలను పణంగాపెట్టి సేవలందించిన వైద్యుల సేవలు నిరుపమానమని వారిని గౌరవించడం మన కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి తదితరులను ఆత్మీయంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ యువ అభివృద్ధి వీ అజయ్‌కీర్తి, నగరసభ సభ్యుడు బస్సు మంజునాథ్, అనిల్‌కుమార్, నగరసభ అప్పి, విజయ్‌కుమార్, లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు అమానుల్లా, లయన్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోల ఫిట్‌నెస్ తనిఖీ



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): నగరంలో సంచరిస్తున్న ఆటోల ఫిట్‌నెస్‌ను ట్రాఫిక్ పోలీసులు పూర్తిస్థాయిలో పరిశీలించారు. బుధవారం నగరంలోని ప్రధాన రహదారులపై పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు వాహనాల ఫిట్‌నెస్‌తోపాటు ప్రమాద బీమా, డ్రైవింగ్ లైసెన్స్, తదితర ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని లేదంటే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



తనిఖీ కోసం వచ్చిన ఆటోలు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి: జేఏసీ జిల్లా కన్వీనర్

రాయచూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను జిల్లాలో విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ, జిల్లా కన్వీనర్ డీఎస్ శరణబసవ కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.ఎస్ వీరేశ్ ఇతర కార్మిక నాయకులతో కలిసి బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడారు. జూలై 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో అవంగన్‌వాడీ, ఆశా వర్కర్‌లతో పాటు వివిధ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న కార్మికులు విధులను బహిష్కరించి సమ్మెలో భాగస్వాములు కానున్నట్లు తెలిపారు. కార్మిక హక్కులను హరించడంతో పాటు పని గంటలను పెంచడం ద్వార కేంద్రం కార్మిక వ్యతిరేఖ ధోరణి అవలంబిస్తున్నట్లు ఆరోపించారు. దీంతో పాటు సమాన పనికి సమాన వేతనం కార్మిక చట్టాల స్థానంలో కొత్తగా తెస్తున్న లేబర్ కోడ్‌ల రద్దు వంటి డిమాండ్‌లు సార్వత్రిక సమ్మెలో ప్రధానంగా ఉన్నట్లు ఆయన వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్ శరణబసవ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.20	1,585.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	32,767	13.410
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,701	297
నీటి నిల్వ (టీఎంసీలు)	77.14	7.91

రాజీతో కేసులు పరిష్కరించుకోవాలి

● జిల్లా న్యాయాధికారి శాంతి



బళ్లారి సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాజీతో కేసులు పరిష్కరించుకోవాలని, బాధితులకు న్యాయం అందించాలన్న ఉద్దేశంతోనే దేశం కోసం మధ్యవర్తిత్వ ప్రచారంపై బుధవారం నుంచి అక్టోబర్ 7వరకు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి శాంతి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ బెంగళూరు, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, మీడియేషన్ ప్లానింగ్ కమిటీ షెడ్యూల్డ్ చేశాయన్నారు. దేశం కోసం మధ్యవర్తిత్వం ప్రచారం అనేది దేశంలోని అన్ని తాలూకా కోర్టులు, హైకోర్టులలో మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి 90రోజులు విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. సుప్రీంకోర్టు ఆర్బిట్రేషన్, కన్సిలియేషన్ ప్లానింగ్ కమిటీ సహకారంతో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, భారత ప్రధాన న్యాయమూర్తి, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఏపీఎంసీ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ మార్గదర్శకత్వంలో దేశం కోసం ఒక ప్రత్యేక మధ్యవర్తిత్వ ప్రచారాన్ని రూపొందించిందన్నారు. అందువల్ల దేశం కోసం మధ్యవర్తిత్వం ప్రచారంలో భాగంగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించగల క్రిమినల్, సివిల్ కేసులను అక్టోబర్ 7వరకు బళ్లారి, విజయనగరం జిల్లాల్లోని అన్ని కోర్టులలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని, రెండు జిల్లాల న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'రాబకొవి' డైరెక్టర్ల ఎన్నికలకు

52 నామినేషన్లు

● ఎన్నికల అధికారి ప్రమోద్



బళ్లారి గాంధీనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాయచూరు, బళ్ళారి, కొప్పళ, విజయనగర జిల్లాల పాల ఉత్పత్తుల సహకార సంఘాల యూనియన్ పాలనా మండలి డైరెక్టర్ల ఎన్నికలకు సంబంధించి మంగళవారం నాటికి 52 నామినేషన్ అందుకున్నట్లు ఎన్నికల అధికారి, బళ్లారి అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రమోద్ తెలిపారు. ఇందులో రాయచూరు నుంచి 15, బళ్లారి-15, కొప్పళ-15 మొత్తం 52 నామినేషన్‌లు వేసినట్లు తెలిపారు. జులై 2వ తేదీ నామినేషన్‌లు ఆఖరు తేదీ, జులై 3వ తేదీ నామినేషన్ పత్రాల పరిశీలన, అదే రోజున నామినేషన్‌ల క్రమబద్ధీకరణ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నామినేషన్‌లు ఉపసంహరణకు జూలై గడువు 4వ తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. జులై 10వ తేదీన డైరెక్టర్ల ఎన్నికకు సంబంధించి ఎన్నికలు జరుగుతాయని, అదేరోజు ఫలితాలు ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు.

పగలే చోరీ

రాయచూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని గద్వాల్ రోడ్డు మారుతి నగర్‌లో బుధవారం పట్టపగలే తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి యజమాని నాగరాజు భార్యతో కలిసి బుధవారం మధ్నాహ్నం బయటికి వెళ్లగా దుండగులు ఇంటి తాళం విరగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న రూ.2.50 లక్షల నగదుతోపాటు 42 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. బాధితులు మార్కెట్ యార్డ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): పేదలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. తాలుకా సమీపంలోని మెట్రి గ్రామ పంచాయతీ పరిధిలోని ఉప్పరళ్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే గణేష్ పేద కుటుంబాల వారికి 44 ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 78కుగాను 44 మందికి బుధవారం పంపిణీ చేశాము. మిగిలిన 34 మందికి గ్రామపంచాయతీ అధికారుల పత్రాలను పరిశీలించి పంపిణీ చేస్తారన్నారు. గత 32 యేళ్ల క్రితం ఆశ్రయోజన కింద ఈ కుటుంబం వారికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. కానీ అప్పటినుండి ఇప్పటివరకు వారికి గ్రామ పంచాయతీ నుంచి స్థలాలకు ఎలాంటి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. పేద కుటుంబాలను దృష్టిలో వుంచుకుని వారికి పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పేద కుటుంబం వారికి ఎలా పథకాలు అందించారో అలాగే తమ కంప్లి నియోజక వర్గంలో కూడా పేద కుటుంబం వారికి ప్రభుత్వం ద్వారా గానీ తమ ద్వారా గానీ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నాగమ్మ, నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు ఈవో శ్రీకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ, పీడీవో బీరలింగ, సొసైటీ అధ్యక్షులు హోసకోటి జగదీష్, గంగాధర గౌడ్, గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేకేఎంఎస్ పదాధికారులు

కంప్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ముష్టిగట్టిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాయం వైద్యుల్ని నియమించాలని ఏఐకేకేఎంఎస్ ఆధ్వర్యంలో కురుగోడు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోవిందు మాట్లాడుతూ ముష్టిగట్ట గ్రామ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడం వల్ల తాలుకాలోని ముష్టిగట్టి హెచ్ వీరాపుర ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అత్యవసర వేళల్లో చికిత్స అందడం లేదన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి భారీ ఆస్పత్రి భవనాన్ని నిర్మించినా వృథాగా మారిందన్నారు. ప్రతి చిన్న జబ్బుకు ప్రైవేట్ వైద్యశాలపై ఆధారపడాల్సి వస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. అధికారుల ముందుకు వచ్చి ముష్టిగట్టి గ్రామంలోని ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజు వైద్యుడి సేవ అందించాలని, అంబులెన్స్‌తో సహా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని లేకపోతే నిరసనలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి గురళ్లి రాజా, యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు కొళూరు పంపాపతి, పంపనగౌడ, వీరన్నగౌడ, ప్రహల్లాద, బుడ్డన్న గ్రామస్తులు బసప్ప, తిమ్మప్ప, మారేష్, రమేష్, బసవనగౌడ, పలువురు రైతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దినేష్

బళ్లారి సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా మేనేజ్‌మెంట్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ జీపీ.దినేష్ నియమితులయ్యారు. బుధవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత రిజిస్ట్రార్ రుద్రేశ్ బదిలీతో ఖాళీ అయిన పదవిని భర్తీ చేయడానికి దినేష్‌ను తాత్కాలిక రిజిస్ట్రార్‌గా నియమిస్తూ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.మునిరాజు ఆదేశాలు జారీ చేశారు.

హెల్మెట్ వాడకంపై పోలీసుల ర్యాలీ



బైక్‌ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

బళ్లారి రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా గ్రామంలో మోకా ఎస్‌ఐ కాళింగ నేతృత్వంలో హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐతో పాటు పోలీసు సిబ్బంది గ్రామ పురవీధుల్లో ద్విచక్ర వాహనాల్లో హెల్మెట్ ధరించి ప్రత్యేకంగా ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరు తప్పకుండా హెల్మెట్ వాడాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ వాడితో ప్రాణాలు కాపాడుకున్నవారవుతారని, తద్వారా కుటుంబం సురక్షితంగా ఉంటున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

బళ్లారిరూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలో బీసీ కాలనీ సర్కారు ప్రాథమిక పాఠశాలలో బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. రామ్‌నగర్ విజయపురం పేపర్ ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వాణిజ్య సంస్థ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి హాజరయ్యారు. ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి 250 మంది విద్యార్థులకు పెన్నులు, అందజేశారు. ఈ కార్యక్రమంలో బీడీసీసీ మాజీ అధ్యక్షుడు రమేష్ గోపాల్ నగేష్, బళ్లారి సేవా సమితి అధ్యక్షులు సురేంద్ర కుమార్, వి రామచంద్ర, కిరణ్ అంగిడి అసోసియేషన్, అధ్యక్షులు వీరాంజనేయులు, బీఎస్ఎస్ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, స్కూలు హెచ్ఎం తిప్పేస్వామి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య పరిరక్షణకు అంకితమైన హాలకట్టి

● హామీ పథకాల అమలు అథారిటీ జిల్లా చైర్మన్ చిదానందప్ప

బళ్లారి సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఫక్కీరప్ప గురుబసప్ప హలకట్టి తన జీవితాన్ని వచన సాహిత్య పరిరక్షణకు అంకితం చేశారని జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ చిదానందప్ప అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ,మహానగర పాలికె సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని సాంస్కృతిక సముదాయంలో బుధవారం హలకట్టి జయంతిలో భాగంగా నిర్వహించిన 'వచన సాహిత సంరక్షణ దినోత్సవ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలగర్భంలో పాతిపెట్టబడిన శరణాలయాల జీవిత విలువలను శోధించడం, అన్వేషించడం, సేకరించడం, సవరించడం, ప్రచురించడం ద్వారా హలకట్టి పరిశోధనా రంగానికి కృషి చేశారని ఆయన అన్నారు. మనం శరణసాహిత్యంపై శ్రద్ధ చూపకపోతే నేడు మనకు చాలా మంది వచనాలు, వచన రచయితలు ఉండేవారు కాదన్నారు. బహదూర్ బహబలేశ్వరప్ప ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ తిమ్మనగౌడ మాట్లాడుతూ హలకట్టి బహుముఖ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని, విద్య, సాహిత్యం, సహకార రంగాల్లో ఆయన బంగారు జీవితంగా ప్రసిద్ధి చెందారన్నారు. కన్నడ, కర్ణాటక ఆయన జీవితానికి ఊపిరి అని అన్నారు. 1880లో జూలై 2న జన్మించిన హలకట్టి ధార్వాడ్ కు చెందిన గురుబసప్ప హలకట్టి కుమారుడు, ఆయన తండ్రి సామాజిక సేవా లక్షణాలను వారసత్వంగా పొందారన్నారు. మద్రాసులో ఉన్నత విద్యను అభ్యసించి విజయపురలో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. హలకట్టి ఇళ్లు, మఠాలు,వరండాలలో పూజించే దేవుళ్లను కనుగొని వచనాలను ముద్రించారు. హలకట్టి స్వాయంగా వాటిని అచ్చువేసి, ముద్రించి సాహిత్యాన్ని ప్రచురించారన్నారు. 250మంది వచన రచయితల వచనాలను సాహిత్యాన్ని బయటకు తీసుకొచ్చారన్నారు. ఇది వచన సాహిత్యానికి ఆయనచేసిన గొప్పసహకారం, అందుకే ఆయనకు'వచన పితామహుడు'అని పిలుస్తారన్నారు. 1926లో బళ్లారిలో జరిగిన 12వ కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షుడిగా హలకట్టి ఎంపిక చేసి ఆయన సాహిత్యసేవలను ప్రశంసించారని గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా కన్నడ, సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ సాధిక్ భాషా, జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కొట్రేశ్, రిటైర్డ్ సీఎస్‌ఐ హుస్సేన, వివిధ పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



హలకట్టి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న చిదానందప్ప తదితరులు

పాఠశాలపై లోకాయుక్త దాడులు

● హెడ్‌మాస్టర్ బదులుగా విధుల్లో తమ్ముడు..!

● అదుపులోకి తీసుకుని విచారణ

బళ్లారి గాంధీనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): కురుగోడు ఫిర్కా పరిధిలోని గెనెకెహాళ్ ఉర్దు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించారు. పాఠశాలలో 14మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో ఒకరు ఉర్దూ ఉపాధ్యాయురాలితో పాటు హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొన్నేళ్ళుగా ఉర్దూ టీచరు స్థానంలో సోదరుడు రోజూ పాఠాలు చెబుతున్నట్లు ఆరోపణల వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బళ్ళారి లోకాయుక్త అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బోధిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారులు డీడీపీఐ, బీఈఓ, సీఆర్‌పీలను లోకాయుక్త అధికారులను విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ తంతంగం అంతా విద్యాశాఖ అధికారులకు తెలిసే జరిగుతోందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లబ్ధిదారులకు కోడిపిల్లల పంపిణీ



కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న డాక్టర్ బసవరాజు

కంప్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కంప్లి పట్టణంలోని పశువుల ఆస్పత్రిలో బుధవారం గ్రామాల్లోని మహిళలకు పశు శాఖ ద్వారా మంజూరైన కోడి పిల్లలను పశువైద్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బసవరాజు మాట్లాడుతూ కంప్లి నియోజకవర్గం నుండి కంప్లి, కురుగోడు రెండు తాలుకా నుండి 183 అర్జీలు వేశారు. అందులో నుండి 148 మందికి జిల్లా పంచాయతీ సీఈవో ఎంపిక చేశారు. 35 మంది రిజెక్ట్ అయ్యారన్నారు. అందులో ఎస్సీ ఐదు మందికి, ఎస్టీ 138 మందికి, జనరల్ ఐదు మందికి ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామాల్లో మహిళలు ఇళ్ల ఆవరణంలోనే పెంపకం చేసుకునేందుకు ఆర్థికంగా మెరుగుపడేందుకు ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించిందన్నారు. బుధవారం కంప్లి, కురుగోడు తాలుకా గ్రామంలో కోడిపిల్లల పంపిణీ చేయడం కూడా జరిగిందన్నారు. మహిళలు సదుపాయాలు సద్వినియోగం చేసుకుని కోడిపిల్లలకు ఆహారం, నీరు సక్రమంగా ఇచ్చి పెంపకం చేపట్టుకుని జీవనం సాగించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, శివప్ప,రామచంద్రప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం సాధించాలి

● విద్యార్థులకు ఆయుర్వేద వైద్యుడు మల్లేశప్ప సూచన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ మల్లేశప్ప

కంప్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులు కృషి, పట్టుదల తో దేన్నయినా సాధించవచ్చునని ఆయుర్వేదిక్ వైద్యులు మల్లేశప్ప అన్నారు. మంగళవారం వైద్యులు పాత్రికేయులు దినోత్సవం సందర్భంగా సన్నాపుర రోడ్డులోని రేయిన్‌బో కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వైద్యులకు ఎంతో ప్రాధాన్యం ఉందని, వైద్యులు లేని గ్రామాలు, పట్టణాలు లేదన్నారు. ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా వ్యాయామం, యోగ, ధ్యానం చేపట్టి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం రెయిన్‌బో కళాశాల వ్యవస్థాపకులు చాంద్ బాషా మాట్లాడుతూ సమాజంలో వైద్యులు, పాత్రికేయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం ఆ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ కోర్సులు సాధించిన విదాయర్థులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ షారుక్, చాంద్ బాషా, డాక్టర్ షఫీ, శ్రీనివాస్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీదారులను ఆదుకుంటాం

● పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్



బట్టా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పత్రికల పంపిణీ దారులు

కంప్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రతినిత్యం ఉదయం ప్రతి ఇంటికి న్యూస్ పేపర్లు అందించే వారికి పురసభ ద్విచక్రవాహనాలు అందించేలా చూస్తామని పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్ అన్నారు. బుధవారం పాత్రికేయుల దినోత్సవం సందర్భంగా పత్రికల వితరణ చేపట్టే యువకులు కేక్ కట్‌చేసి పత్రికా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పురసభ అధ్యక్షులకు పలు సమస్యలపై మనవిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పత్రికల వితరణ ప్రముఖులు భరత్ కుమార్ మాట్లాడుతూ పురసభ ఎన్నో పథకాలు అందిస్తున్నారు. వారితో పాటు ప్రతినిత్యం పత్రికలు ఇంటికి చేర్చే యువకులకు ద్విచక్రవాహనాలు సదుపాయాలు కల్పించాలన్నారు. కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి, ఆనందరావు, సంతోష్, భరత్, ధనుంజయ, హనుమేష్, లక్ష్మన్న, శశిధర్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం



మొక్కను నాటుతున్న వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు హుమయూన్ ఖాన్

బళ్లారి సిటీ/రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి):నగరంలోని ఈద్గామైదానంలో బుధవారం కర్ణాటక అటవీ శాఖ నేతృత్వంలో బళ్లారి ముస్లీం యువక్రాంతి బృందం వనమహోత్సవం ఘనగా నిర్వహించారు. ఇందులో తన తల్లిపేరు మీద వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు హుమయూన్ ఖాన్ మొక్క నాటి కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ పొందాలంటే మొక్కలు పెంచాలన్నారు. సమాజంలోని నాయకుల సహకారంతో అటవీ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమైనదన్నారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు జరగాలన్నారు. కార్యక్రమంలో సామాజిక అటవీ శాఖ దినసరివేతన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహబూబ్ భాష, అటవీ మండల అధికారి పరశురాం, ప్రాంతీయ మండల అటవీ అధికారి గిరీశ్, గస్తీ అటవీ అధికారి హనుమేశ్, సైపుల్లాసాబ్, కణేకల్ మాబుసాబ్, గోవింద్, సమీర్‌సేథ్, బసవరాజ్, షాషావలి మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు ఆసిస్, హర్షద్, సమీర్, చంద్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్



నిరసనలో అన్నా డీఎంకే నాయకులు, కార్యాకర్తలు

అన్నా డీఎంకే నిరసన

హోసూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): హోసూరు పశ్చిమ జిల్లాలోని పోలీసు అధికారి అజిత్‌కుమార్ హత్యా నిందితలును అరెస్టు చేయాలని కోరుతూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. పార్టీ ఏరియా కార్యదర్శి రాజీ నేతృత్వంలో మునిసిపాలిటీ తూర్పు విభాగానికి చెందిన అన్నాడీఎంకే కార్యకర్తలు రాయకోట్టై రోడ్డులో చేపట్టారు. అలాగే ఏరియా కార్యదర్శి అశోక్ నేతృత్వంలో మునిసిపాలిటీ ఉత్తర విభాగం అన్నాడీఎంకే కార్యకర్తలు జూజువాడిలో నిరసన తెలిపారు. హోసూరు నగర పశ్చి అన్నాడీఎంకే కార్యకర్తలు ఈశ్వర్‌నగర్‌లో ఏరియా కార్యదర్శి మంజునాథ్ నాయకత్వంలో ధర్నా చేపట్టారు. ఇలా ప్రాంతాలవారీగా తమ నిరసన తెలిపారు. పోలీసు అధికారికే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

గుట్కా, మద్యం స్వాధీనం

హోసూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): హోసూరు పట్టణ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ నేతృత్వంలో హోసూరు-రాయకోట్టై రహదారిపై మంగళవారం వాహన తనిఖీల వేళ బెంగళూరు వస్తున్న కారును సోదాలు చేశారు. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన 107 కిలోల గుట్కా, కర్ణాటక రాష్ట్రానికి చెందిన 60మద్యం సీసాలను గుర్తించారు. గుట్కా, మద్యంతోపాటు కారును స్వాధీనం చేసుకున్నారు. కారులోని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. దిండిగల్ ప్రాంతానికి చెందిన సుకుమార్ (31), చెన్నైకు చెందిన పార్తిబన్ (31)గా గుర్తించారు. హోసూరు నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ వసంత్‌కుమార్

రాయచూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని 4వ వార్డు పరిధిలో రూ.5 లక్షల ఎమ్మెల్సీ నిధులు, రూ.25లక్షలు కేకేఆర్‌డీబీ నిధుల ద్వారా చేపట్టనున్న పనులకు విధాన పరిషత్ సభ్యుడు వసంత్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. మొత్తం రూ.30 లక్షల వ్యయంతో నిర్వహించే అంగన్‌వాడీ భవనంతో పాటు హైటెక్ వంట గది నిర్మాణం, సీసీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు.

ధార్మిక విభాగం ఆధ్వర్యంలో ఉచిత వివాహం

హోసూరు, జూలై2(ఆంధ్రజ్యోతి): హిందూమత ధార్మిక వ్యవహారాల మంత్రి శేఖర్ మార్గదర్శకత్వంలో తిరువణ్ణామలై జాయింట్ కమిషనర్ జోన్ మోహన సుందరం నేతృత్వంలో బుధవారం ఉచిత వివాహం జరిగింది. హోసూరుకు చెందిన నవీన్‌కుమార్, ధర్మపురికి చెందిన వాణిప్రియల వివాహం చంద్రచూడేశ్వర ఆలయంలో వారు చేపట్టారు. కృష్ణగిరి అసిస్టెంట్ కమిషనర్ డివిజన్ రామవేలు, ఎంపీ గోపినాథ్, ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులకు 4 గ్రాముల తాళి, షర్టు, చీర, కామాక్షి అమ్మవారి దీపం, పూజాసామగ్రి, చెరో చేతి గడియారం, చాప, పరుపు, దిండ్లు, వంటసామగ్రి, మిక్సీ ఇతరత్రా సుమారు 70వేల రూపాయల వస్తువులు అందచేశారు.



ఉచిత వివాహంలో ఒక్కటైన దంపతులు